క్లుప్తంగా

4న గౌరీ పరమేశ్వరుల మహోత్సవం

మునగపాక: మండల కేంద్రం మునగపాకలో వచ్చేనెల 4న గౌరీ పరమేశ్వరుల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నట్టు ఉత్సవ కమిటీ చైర్మన్ పెంటకోట ఆదినారాయణ తెలిపారు. శుక్రవారం రాత్రి ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వచ్చేనెల 1వ తేదీ సాయంత్రం గౌరీ పరమేశ్వరుల సారె ఊరేగింపు నిర్వహించనున్నట్టు చెప్పారు. ఈ సమావేశంలో ఉత్సవకమిటీ గౌరవ అధ్యక్షుడు పొలిమేర అప్పలనాయుడు, ఉపాధ్యక్షులు టెక్కలి కొండలరావు, పెంటకోట సత్యనారాయణ,కార్యదర్శి ఆడారి అప్పలనాయుడు,కోశాధికారి పొలిమేర కృష్ణ, సహాయ కార్యదర్శులు శ్రీకాంత్,సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు

కోటవురట్ల: పేదలందరికీ సొంతిల్లు ఉండాలనే లక్ష్యంతో వైఎస్సార్ జగనన్న కాలనీలను రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని ఎంపీడీవో చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని నీలిగుంట శివారు జీఎస్సార్ పాలెం, బోడపాలెం శివారు కొత్తూరు గ్రామాల్లో శనివారం హౌసింగ్ డే నిర్వహించారు. హౌసింగ్ టీమ్ లేఅవుట్లలో పర్యటించి, లబ్ధిదారులతో మాట్లాడి, సమస్యలు తెలుసుకుంది. ఈసందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలన్నారు. ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. హౌసింగ్ జగదీశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మౌలిక సదుపాయాల కల్పనకు కృషి



డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న గంగప్పలనాయుడు, దేవీచంద్ర

మునగపాక: గంగాదేవిపేటలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామని మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగప్పలనాయుడు తెలిపారు. మూలపేట శివారు గంగాదేవిపేటలో నూతనంగా నిర్మించనున్న డ్రైనేజీపనులకు శనివారం ఉప సర్పంచ్ మొల్లేటి దేవీచంద్రతో కలిసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీరు, పారిశుధ్యం, వీధి దీపాల ఏర్పాటుపై పాలకవర్గం ప్రత్యేక దృష్టి సారించినట్టు చెప్పారు. పంచాయతీ కార్యదర్శి శ్రీలక్ష్మి,పెద్దలు ఆడారి శ్రీనివాసరావు, సమ్మెంగ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

గోతుల పూడ్చివేత



గోతులు పూడుస్తున్న కూలీలు

రాంబిల్లి : నారాయణపురం-దిమిలి రోడ్డుపై పడిన గోతులను పూడ్చుతున్నారు. ఆర్అండ్‌బీ అధికారుల ఆధ్వర్యంలో గోతుల పూడ్చివేత పనులు చురుగ్గా జరుగుతున్నాయి.

శ్మశాన వాటికలో చెత్త తొలగింపు



శ్మశాన వాటికలో చెత్తను పొక్లెయిన్‌తో తొలగిస్తున్న దృశ్యం

కోటవురట్ల: కె.వెంకటాపురంలోని శ్మశాన వాటికలో శుక్రవారం పారిశుధ్య పనులు నిర్వహించారు. చాలా కాలంగా భారీగా చెత్త పేరుకుపోవడంతో సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ తొలగింపునకు చర్యలు చేపట్టారు. పొక్లెయిన్‌తో చెత్తను తొలగించి శుభ్రం చేశారు.

కొనసాగుతున్న నేవీ నిర్వాసితుల ధర్నా

రాంబిల్లి: నేవీ నిర్వాసితులు, నేవీ ప్రభావిత గ్రామాల ప్రజల ధర్నా కొనసాగుతోంది. శనివారం నాటికి ధర్నా 90వ రోజుకు చేరింది. వాడనర్సాపురం, కొత్తపట్నం, కొప్పుగొండుపాలెం, వాడపాలెం, నేవీ పునరావాసకాలని, గోవిందపాలెం, కొత్తపేట, చినకలవలాపల్లి గ్రామాల ప్రజలు ఈ ధర్నాలో పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో రథసప్తమి వేడుకలు



కోటవురట్ల శివాలయంలో ఆదిత్యునికి పూజలు చేస్తున్న భక్తులు



పాండురంగ ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న ఆలయ అర్చకులు కృష్ణస్వామి



సూర్యభగవానుడికి పూజలు నిర్వహించిన దృశ్యం

నక్కపల్లి: రథసప్తమి వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయం తెల్లజిల్లేడు ఆకులు, రేగపండ్లు నెత్తిన పెట్టుకుని తలస్నానమాచరించారు. ఆదిత్యునికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం చిక్కుడు కాయలతో రథం చేసి నైవేద్యం సమర్పించారు. మండలంలో ఉపమాక లక్ష్మణేశ్వర స్వామి ఆలయం, డీఆర్‌డీ పీఠంలోను, నామవరం స్వయంభూ రామలింగేశ్వర ఆలయంలో రథసప్తమి వేడుకలు జరిగాయి.

కోటవురట్ల: మండలంలో శనివారం రథసప్తమిని భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. సూర్యభగవానుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఆదిత్య హృదయం పఠించి, ఆయురారోగ్యాలు ప్రసాదించాలని కోరుకున్నారు. స్థానిక ఉమా రామలింగేశ్వరస్వామి, చిన లింగాపురంలోని దుర్గా మల్లేశ్వరఅయ్యప్ప ఆలయాల్లో ప్రత్యేక పూజలు, సూర్యనమస్కారాలు చేశారు.

పాయకరావుపేట: మండలంలోని పలు దేవాలయాల్లో రథసప్తమి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పట్టణంలోని పాండురంగ దేవస్థానం, రాజుగారిబీడులో వేంకటేశ్వరస్వామి దేవాలయం, పాల్తేరు, మంగవరం గ్రామాల్లో గల వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు అధిక సంఖ్యలో హాజరై పూజలు చేశారు.

అట్టహాసంగా చిక్కాల జన్మదిన వేడుకలు



చిక్కాలకు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న మంత్రి అమర్‌నాథ్,ఎమ్మెల్యే బాబూరావు

పాయకరావుపేట: జిల్లా వ్యవసాయ సలహామండలి చైర్మన్, మాజీ జెడ్పీ ఫ్లోర్ లీడర్ చిక్కాల రామారావు జన్మదిన వేడుకలు శనివారం అట్టహాసంగా జరిగాయి. స్వగ్రామం పెంటకోటతో పాటు, పాయకరావుపేట పట్టణంలో ఆయన అభిమానులు పలు సేవాకార్యక్రమాలు నిర్వహించారు.రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖామంత్రి గుడివాడ అమర్‌నాథ్, పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు, రాష్ట్ర గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ తదితరులు రామారావు ఇంటికి వచ్చిన కార్యకర్తలు,అభిమానులు ఏర్పాటు చేసిన కేకును కట్‌చేసి గజమాలతో సత్కరించి, జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వారు మాట్లాడుతూ రామారావు నిజాయితీతో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారని చెప్పారు.చిక్కాల జన్మదినం సందర్భంగా పట్టణ అధ్యక్షుడు దగ్గుపల్లిసాయి ఆధ్వర్యంలో పాయకరావుపేట పీహెచ్‌సీలో రోగులకు పాలు,రొట్టెలు పంపిణీ చేశారు. పెంటకోట పాఠశాలలో చిక్కాల కుమారుడు ప్రభాకర్‌రావు విద్యార్థులకు స్టేషనరీ పంపిణీ చేశారు. పెంటకోట లో అడపా అశోక్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. అడ్డురోడ్డు, ఉపమాకలలో అభిమాను లు కేక్‌కట్ చేశారు. చిక్కాల మాట్లాడుతూ తనపై ఉన్న అభిమానంతో శుభాకాంక్షలు తెలిపిన వారికి, సేవాకార్యక్రమాలు నిర్వహించి న వారికి ధన్యవాదాలు తెలిపారు.చిక్కాలకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపినవారిలో ఎంపీపీ ఇసరపు పార్వతి తాతారావు, పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జ్‌లు రాశే ష్‌ఖన్నా,తాతబాబు,శ్రీరామచంద్రరాజు,సుందరలత, రామలక్ష్మిగోవిందు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు దగ్గుపల్లిసాయి, సర్పంచ్‌లు కోడకోటేశ్వరరావు, పన్నీరు బాబ్జి,సకిలే రాము, చేపల నాగమణి,గోవిందు,ఎంపీటీసీలు సతీష్ రాజు,మణికంఠస్వామి, నాయకులు సూర్యనారాయణ, వంగలపూడి రాము, సూరాకాసులగోవిందు,శీరం నర్సింహమూర్తి,శ్రీనివాస్,గంగిరెడ్ల వెంకటరమణ,యజ్జల అన్నవరం ఉన్నారు.

కళ్లద్దాల పంపిణీ

ఎస్.రాయవరం: చిక్కాల రామారావు జన్మదిన వేడుకలు రేవుపోలవరంలో శనివారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ చోడిపల్లి అనూరాధ గోవిందు ఉచిత కంటివైద్య శిబిరం నిర్వహించారు. 80 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, చిక్కాల రామారావు చేతుల మీదుగా కళ్లద్దాలు, మందులు అందజేశారు.



పాయకరావుపేట ఆస్పత్రిలో పాలు, రొట్టెలు పంపిణీ చేస్తున్న అభిమానులు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

గడప గడపకు మనప్రభుత్వంలో ఎమ్మెల్యే కన్నబాబు రాజు



వెదురువాడలో స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కన్నబాబు రాజు

అచ్యుతాపురం(అనకాపల్లి): వలంటీర్లు, సచివాలయ సిబ్బంది బాధ్యతాయుతంగా పనిచేసి అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందజేయాలని యలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు రాజు అన్నారు. అచ్యుతాపురం మండలం వెదురువాడలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో మాట్లాడి పంచాయతీ స్థితిగతులపై ఆరా తీశారు. ఈ సందర్భంగా వారిని అభినందిస్తూ బ్యాగ్‌లను అందజేశారు. అంతకు ముందు గ్రామంలో ఇంటింటికీ వెళ్లి గత మూడేళ్లుగా చేపడుతున్న సంక్షేమ పథకాలను గురించి వివరించారు. నవరత్నాలు పథకాల కరపత్రాలను అందజేశారు. పథకాలను అందించడంలో ఎటువంటి వివక్ష ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, జెడ్పీటీసీ లాలం రాంబాబు, కోఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్, ఎంపీపీ భర్త కోన బుజ్జి, మాజీ ఎంపీపీ శ్రీనివాసరాజు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఘనంగా అభయాంజనేయ స్వామి తీర్థం



నడింపల్లిలో కోలాటం ఆడుతున్న మహిళలు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలం నడింపల్లిలో శనివారం అభయాంజనేయ స్వామి తీర్థాన్ని ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము నుంచే స్వామి వారిని భక్తులు దర్శించుకుని, పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన కోలాటాలు, తోడపెద్దు సేవ, చిటికెలు ఆకట్టుకున్నాయి.

జనరంజకపాలన చూసి ఓర్వలేకపోతున్న టీడీపీ

మాజీ ఎమ్మెల్యే చెంగల



నక్కపల్లి: జనరంజకమైన పాలనసాగిస్తున్న జగన్‌మోహన్‌రెడ్డిని చూసి పచ్చపార్టీ వాళ్లు ఓర్వలేకపోతున్నారని, నారా వారి దిష్టి జననేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుటుంబంపై పడకూడదని రథసప్తమి రోజున సూర్యభగవానుడికి, ఉపమాక వేంకటేశ్వరస్వామికి పూజలు చేసినట్టు పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకటరావు తెలిపారు. శనివారం ఆయన ఉపమాకలో వేంకటేశ్వరస్వామిని, పాయకరావుపేటలో పాండురంగ స్వామిని దర్శించుకున్నారు. అనంతరం ఆయన ఉపమాకలో విలేకర్లతో మాట్లాడారు. ఇతర రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకునే విధంగా సంక్షేమకార్యక్రమాలు అమలు చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డికి శాపనార్థాలు పెడుతున్నారన్నారు. జగనన్న కుటుంబం నిండునూరేళ్లు క్షేమంగా ఉంటేనే రాష్ట్ర భవిష్యత్ బాగుంటుందని చెప్పారు. జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రతిపక్ష పార్టీలు కుట్రపన్నుతున్నాయని ఆరోపించారు. రాష్ట్రప్రజలు ప్రలోభాలకు, ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని నమ్మితే రాష్ట్ర భవిష్యత్ మరో 40 ఏళ్లు వెనక్కిపోతుందన్నారు. ఎన్నిపార్టీలు కలిసిపోటీచేసినా అంతిమంగా ప్రజల అశీస్సులు వైఎస్సార్‌సీపీకే ఉన్నాయని, మళ్లీ 2024లో జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం తథ్యమని చెప్పారు.

ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య



బషీర్ మృతదేహం

యలమంచిలి: యలమంచిలి పట్టణానికి సమీపంలో శ్మశానవాటిక వద్ద ఒక యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు పట్టణ ఎస్‌ఐ పాపినాయుడు తెలిపారు. యలమంచిలి పట్టణానికి చెందిన షేక్ బషీర్(20) శనివారం శ్మశానవాటిక వద్ద ఒక చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి తల్లి తాహిర ఫిర్యాదుమేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్‌ఐ తెలిపారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు

- 102, 104 టోల్ ఫ్రీ నంబర్లకు సమాచారమీయండి
- ఆర్డీవో ఏజీ చిన్నికృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో చిన్నికృష్ణ

తుమ్మపాల: ఆడ పిల్లలు సృష్టికి మూలం. గర్భస్థ పిండ పరీక్షలు చేసి ఆడపిల్లలను అంతం చేయడం హీనమైన చర్య అని ఆర్డీవో ఏజీ చిన్నికృష్ణ అన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులకు ఆదేశించారు. ఆర్డీవో కార్యాలయంలో శనివారం జరిగిన పీసీ అండ్ పీఎన్‌డీటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ లింగ నిర్ధారణ పరీక్షలు చేసిన వారికి మొదటి సారి మూడేళ్ల జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా, రెండోసారి చేస్తే ఐదేళ్ల జైలు, రూ.50 వేలు నుంచి రూ.లక్ష వరకు జరిమానాతో పాటు వారి గుర్తింపు రద్దు చేయబడుతుందన్నారు. ఆడపిల్లలతోనే సమాజం వృద్ధి చెందుతుందని, వారిని కడుపులోనే అంతం చేయడం పాశవికచర్య అన్నారు. స్కానింగ్ సెంటర్‌లపై నిఘా పెట్టాలని, నిబంధనలు అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అదనపు డీఎంహెచ్‌వో శారదాబాయి మాట్లాడుతూ లింగనిర్ధారణ పరీక్ష చేసిన వారు, చేయించుకున్నవారు, ప్రోత్సహించిన వారు.. అంతా శిక్షార్హులేనన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు సమాచారం తెలిసిన వారు 102, 104 టోల్‌ఫ్రీ నంబర్లకు, pcpndt.ap.gov.in ద్వారా ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేయాలన్నారు. ఫిర్యాదు చేసినవారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు. అనకాపల్లి డివిజన్‌లో 37 స్కానింగ్ సెంటర్లు అనుమతిపొందినట్టు తెలిపారు. ఏఎన్‌ఎంలు, ఆశా గృహ సందర్శకులు ఆడపిల్ల సంరక్షణ ప్రాముఖ్యతను ప్రచారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీపీ వి.రాజరాజేశ్వరి, వైద్యవిధాన పరిషత్ డాక్టర్ విజయశంకర్, డీఎంఈవో ఝాన్సీరాణి, పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాలు

తుమ్మపాల : స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీఐటీయూ ఆధ్వర్యంలో శనివారం గవరపాలెం పార్కు సెంటర్ వద్ద సంతకాల సేకరణ జరిగింది. గౌరీపరమేశ్వరుల మహోత్సవం సందర్భంగా తరలివచ్చిన ప్రజల నుంచి సంతకాలు సేకరించినట్టు సీఐటీయూ నాయకులు వి.వి.శ్రీనివాసరావు, గనిశెట్టి సత్యనారాయణ తెలిపారు. విశాఖ ఉక్కు, ఆంధ్రుల హక్కు అనే నినాదంతో ఏర్పడిన స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరణ నుంచి కాపాడుకోవాలన్నారు.

జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం



వాడ్రాపల్లిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీడీవో రవికుమార్

మునగపాక: జగనన్న లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఎంపీడీవో పి.రవికుమార్ కోరారు. మండలంలోని వాడ్రాపల్లిలో జగనన్న లేఅవుట్‌ను శనివారం సందర్శించారు.ఈ సందర్భంగా లబ్ధిదారులతో సమావేశమయ్యారు. జగనన్న కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. ఇక్కడ తాగునీటి సదుపాయం కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈవోఆర్డీ ఈశ్వరరావు,వెలుగు ఏపీఎం కొండమ్మ,పంచాయతీ కార్యదర్శి సునీత, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

కలెక్టర్ ఆదేశాలతో డ్రైనేజీ సమస్యకు పరిష్కారం



కాలువ నిర్మించాలని ఆదేశిస్తున్న డీపీవో

నక్కపల్లి: చినదొడ్డిగల్లు బద్దివీధిలో నెలకొన్న డ్రైనేజీ సమస్యను పరిష్కరించేందుకు కలెక్టర్ ఆదేశాలతో పంచాయతీ అధికారులు చర్యలు చేపట్టారు. నాలుగైదు సంవత్సరాలుగా బద్దివీధిలో వాడుక నీరు బయటకు వెళ్లకుండా కొంతమంది అడ్డుకుంటున్నారు. దీంతో వర్షాలు పడిన సమయంలో రోడ్లపైనే నీరు నిలిచిపోయేది. శనివారం గ్రామానికి వచ్చిన కలెక్టర్‌కు వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, స్థానిక నాయకులు ఈ సమస్య వివరించారు. వెంటనే కలెక్టర్ స్పందించి డీపీవో శిరీషారాణికి ఆదేశాలు జారీ చేశారు. ఆమె ఆ ప్రాంతాన్ని పరిశీలించి ఆక్రమణలు తొలగించి, కాలువ నిర్మించాలని ఈవోపీఆర్‌డీ నారాయణను ఆదేశించారు.

అప్రోచ్‌రోడ్డు నిర్మాణానికి భూమిపూజ



అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంపీపీ జయలక్ష్మి

మునగపాక: గ్రామాలాభివృద్ధే ధ్యేయంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం పని చేస్తోందని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అన్నారు. మండలంలోని తోటాడ పంచాయతీ త్రిమూర్తుల ఆలయ సమీపంలో గతంలో డెయిరీ నిధులతో నిర్మించిన బ్రిడ్జికి ఇరువైపులా రూ.6లక్షలతో అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి శనివారం ఆమె భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా జయలక్ష్మి మాట్లాడుతూ ఎన్నికల ముందు ప్రజలకు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలన్నీ అమలవుతున్నాయన్నారు. రహదారుల అభివృద్ధికి ప్రభుత్వం నిధులు మంజూరు చేస్తోందన్నారు. సర్పంచ్ దొడ్డి మంగవేణి కోటేశ్వరరావు,ఎంపీటీసీ కాండ్రేగుల వెంకటలక్ష్మి,వైఎస్సార్‌సీపీ నేతలు షేక్ ఇస్మాయిల్,దొడ్డి బాలాజీ, వైఎస్సార్‌సీపీ మండల కోశాధికారి మళ్ల ఈశ్వరరావు,వార్డు సభ్యులు బుద్ద రవి,మహలక్ష్మినాయుడు,కాండ్రేగుల సత్యనారాయణ,మళ్ల రవి,సూర్యనారాయణ, శేషు,గంగాజీ తదితరులు పాల్గొన్నారు.

భావనారుషి మహోత్సవాలకు శ్రీకారం

పందిరిరాట వేసిన నిర్వాహకులు



పందిరిరాట వేస్తున్న నిర్వాహకులు

నక్కపల్లి: మండల కేంద్రం నక్కపల్లిలో భావనారుషి మహోత్సవాలకు శ్రీకారం చుట్టారు. ఈ మేరకు శనివారం పందిరి రాటవేశారు. వచ్చే నెల 6న ఈ మహోత్సవం అంగరంగ వైభవంగా జరగనుంది. భావనారుషి పండగ (శూలాల సంబరం) ప్రతి ఏటా మాఘమాసంలో అత్యంత ఘనంగా నిర్వహిస్తారు. శూలాల సంబరం సందర్భంగా భావనారుషి ఆలయంలో పద్మశాలీలు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. శూలాలను శరీరానికి గుచ్చుకుని నృత్యాలు చేస్తూ, ప్రభలను నక్కపల్లి వీధుల్లో ఊరేగిస్తారు. ఈ సంబరాన్ని తిలకించేందుకు చుట్టుపక్కల గ్రామాలనుంచి వందలాది మంది తరలివస్తారు. స్వామి,అమ్మవార్ల విగ్రహాలను తెల్లవార్లు ఊరేగిస్తూ సంబరం నిర్వహిస్తారు. పందిరి రాట వేసేకార్యక్రమంలో నిర్వాహకులు జి.బంగార్రాజు, మాడేం అప్పలరాజు, కొల్లూరి మహేష్, నాగబాబు, కుమార్, ఎం.అప్పన్న, త్రిమూర్తులు తదితరులు పాల్గొన్నారు.

సీతారామరాజుకు డిప్యూటీ సీఎం పరామర్శ



సీతారామరాజును పరామర్శిస్తున్న డిప్యూటీ సీఎం ముత్యాలునాయుడు

కోటవురట్ల: డిప్యూటీ సీఎం బూడి ముత్యాలునాయుడు తంగేడులోని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి ఆర్.ఎస్. సీతారామరాజును శనివారం పరామర్శించారు. సీతారామరాజు భార్య వరలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సందర్భంగా వరలక్ష్మి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. మాజీ ఎమ్మెల్సీ డీవీ సూర్యనారాయణరాజు, డీసీసీబీ మాజీ చైర్మన్ ఆర్ఎస్ రామచంద్రరాజు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, పలువురు నాయకులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. అంతకుముందు మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు సీతారామరాజును పరామర్శించారు.

పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారిపై విచారణ



విచారణ బృందానికి వినతి పత్రం అందజేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

ఎస్.రాయవరం: పెనుగొల్లు పీహెచ్‌సీ వైద్యాధికారి రామనాయక్‌పై వైద్యుల బృందం శనివారం విచారణ జరిపింది. వైద్యుని తీరు కారణంగా ఇబ్బంది పడుతున్నామని ఇటీవల పీహెచ్‌సీ సిబ్బంది, పలువురు ఏఎన్‌ఎంలు జిల్లా వైద్యాధికారికి ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు వైద్యులు శారదాబాయి, జ్యోతి,మురళీధర్ పీహెచ్‌సీ పరిధిలో విచారణ చేపట్టారు. స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు వెదుళ్ల బంగారి, గొంతిన నరసింహమూర్తి,ఉద్దండం సూర్యనారాయణ, ఐ.వి. రత్నం విచారణ బృందాన్ని కలిశారు. వైద్యాధికారి రామనాయక్ వచ్చిన తరువాత వైద్య సేవలు చాలా బాగా అందుతున్నాయని, సిబ్బందిని సకాలంలో విధులకు హాజరయ్యేలా చేస్తున్నారని చెప్పారు. ఈ మేరకు ఓ వినతి పత్రాన్ని విచారణ బృందానికి అందజేశారు.నివేదికను జిల్లా వైద్యాధికారి అందజేస్తామని విచారణ బృందం సభ్యులు తెలిపారు.

బోధనా విధానంలో మార్పులు తప్పనిసరి

డీఈవో లింగేశ్వరరెడ్డి



ఉపాధ్యాయుల అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఈవో లింగేశ్వరరెడ్డి

ఎస్.రాయవరం: ఉపాధ్యాయుల బోధనా విధానంలో పూర్తిస్థాయిలో మార్పులు రావాలని, విద్యా సంవత్సరం పూర్తయ్యే సరికి జిల్లాలో ప్రతీ పాఠశాల విద్యార్థి మినిమమ్ బేసిక్స్ రావాల్సిందేనని, లేకపోతే చర్యలు తప్పవని డీఈవో బి.లింగేశ్వరరెడ్డి హెచ్చరించారు. తిమ్మాపురం కస్తూర్బా పాఠశాలలో మండల ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ఒక్కో పాఠశాలకు ప్రభుత్వం వేలాది రూపాయలు ఖర్చు చేస్తోందని, బోధన తీరుపై పూర్తి స్థాయిలో పర్యవేక్షణ ప్రారంభించారని చెప్పారు. ఉపాధ్యాయులు పాఠం చెప్పిన తరువాత విద్యార్థులకు ఏస్థాయిలో అర్థమవుతోంది, ఎలా చదువుతున్నాడు, ఏం చదువుతున్నాడు, చదివినది వర్కుబుక్‌లో ఎలా రాస్తున్నాడనేది నిత్యం పర్యవేక్షించాలని సూచించారు.ఒక వేళ విద్యార్థికి అర్థంకాకపోతే ఎలా చెబితే అర్థం అవుతోంది అన్న విషయంపై ఉపాధ్యాయుడు దృష్టి సారించాలన్నా రు. ఉపాధ్యాయులు బోధనా విధానంలో మార్పులేకపోతే షోకాజ్‌లు,సస్పెన్షన్లు, ఇతర చర్యలు ఉంటాయన్నారు. బడిమానేసిన పిల్లల వివరాలు సచివాలయాల వారీగా సేకరించి, మళ్లీ పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. వెనుకబడి ఉన్న విద్యార్థికి 20 నుంచి 90 రోజుల పాటు ప్రత్యేక బోధన, పర్యవేక్షణ ఉండాలని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకం అమలును నిత్యం పర్యవేక్షిస్తూ, మెనూ సక్రమంగా అమలు జరిగేలా చూడాలన్నారు. ఈకార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి ఎ.ఎస్. ఎస్.ఎ.ఎస్ మూర్తి, హెచ్ఎంలు పురుషోత్తమరావు, శాంతి ప్రసూన పాల్గొన్నారు.

గంగ పరదేశమ్మ ఆలయానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న కొణతాల రఘునాథ్ దంపతులు

అనకాపల్లిటౌన్: గవరపాలెం గంగపరదేశమ్మ అమ్మవారి నూతన ఆలయ నిర్మాణానికి వ్యాపారవేత్త కొణతాల రఘునాథ్ దంపతులు శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయ నిర్మాణానికి తమవంతు పూర్తి సహాయం అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆలయ ప్రతినిధులు పొలిమేర గోపి, సంతోష్, కొణతాల రమణబాబు, కాండ్రేగుల నాయుడుపాల్గొన్నారు.